# బైబిలు దేవుని గ్రంథం

బైబిలు దేవుని గ్రంథమని చెప్పుకొంటుంది. దాని పుటలలో రెండువేలకంటె ఎక్కువ సార్లు "ప్రభువు సెలవిచ్చె"డనే సందేశం ఆయా రూపాల్లో కన్పిస్తుంది. "దేవుడు... మాట్లాడెను" అని హెబ్రీ. 1:1, 2 చెప్తుతోంది. "పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" అని 2 పేతురు 1:21బి అంటుంది. లేఖనములు దైవప్రేరేపితములు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17).

బైబిలు సత్ గ్రంథమేగాని, అది దైవ ప్రేరేపితమయ్యింది కాదని కొందరి నమ్మిక. అది అలా అయ్యుండడానికి వీలులేదు: అది దేవుని వాక్యం కాకపోతే, అది మోసమై యుండాలి.

బైబిలు దైవ ప్రేరేపిత గ్రంథమని నమ్మడానికి మంచి కారణాలున్నాయా? ఉన్నాయని మేము నమ్ముతాం! ఈ పాఠము వాటిలో కొన్నింటిని వివరిస్తుంది.

"అంతరంగ రుజువులు" అని మనం సూచించేవాటిని మొదటిగా ఆలోచించుదాం. దాని పుటలలోనే దైవ ప్రేరేపితాన్ని బైబిలు రుజువు చేస్తుంది. బైబిలునందు నీ విశ్వాసాన్ని పెంచుకొనే ఒక శ్రేష్ఠమైన విధానం దాన్ని చదవడం.

## బైబిలు యొక్క ఏకత్వము, దాని పొందిక

బైబిలుగా కూర్చబడ్డ గ్రంథము అరవై ఆరు పుస్తకాలతో కూడినది. ఈ రచనలన్నీ ఒకేసారి వ్రాయబడ్డవి కావు. అవి దాదాపు నలభైమంది విభిన్న లేఖకులచే వ్రాయబడ్డాయి, అవి వ్రాయబడడానికి రమారమి పదహారువందల సంవత్సరాలు పట్టింది. ఈ మనుష్యులు అనేక రకాలైన అంశాలమీద వ్రాశారు, అనేక కోణాల్లోనుండి వాటిని చర్చించారు. చివరిగా, ఆ రచనలన్నీ సమకూర్చి ఒకటిగా సంపుటం చేశారు. ఒకడు దాన్ని చదివితే, అది ఒకే గ్రంథమన్న వాస్తవాన్ని ఒప్పుకుంటాడు! పొందిక, ఏకత్వము, అనుగుణ్యత అనేవి దానంతటిలో గోచరిస్తుంది. గ్రంథంలోని రచనలు ఒకదానికొకటి కొనసాగింపుగాను, అనుబంధంగాను ఉంటాయిగాని, పరస్పర విరుద్ధంగా ఉండవు.

ఇదే విధంగా ఒక విజ్ఞాన శాస్త్రవేత్తల గుంపు ఒక పుస్తకాన్ని కూర్చ బూనుకున్నారనుకో, దానికి ఫలితం ఏమౌతుందనుకుంటావు? అది పరస్పర వైరుధ్యం గలదై ఉంటుంది. అవును, అట్టి విభిన్న పరిస్థితులలో, అంతమంది వ్యత్యాసమైన మనుష్యులచే రూపొందింప బడిన గ్రంథం మానవాతీత శక్తిచే నడిపింపబడిందని బలంగా చెప్తుంది.

## ప్రవచనాలు వాటి నెరవేర్పులు

అంతరంగ రుజువుగా బైబిలు పాఠకుని అత్యధికంగా ఒప్పించేది లేఖకులచే ప్రదర్శింపబడిన అసహజమైన భవిష్యత్ జ్ఞానము కావచ్చు. వారు చరిత్ర వాస్తవాలను దాఖలు చేస్తున్నట్టుగానే భవిష్యత్ విషయాలను వ్రాశారు. రుజువు అనే గొలుసులో యిది బలమైన లింకుగా నిలుస్తుంది. పాత నింబంధన లేఖనాలలో వన్నెకెక్కిన మూడు గుంపుల ప్రవచనాలు కన్పిస్తాయి.

### దేశాల ఔన్నత్య, పతనాలు, మరియు పట్టణాల నాశనాన్ని గూర్చిన ప్రవచనాలు

అది పలుకబడిన అయిదువందల సంవత్సరాల తరువాత యెహోషువా 6:26 నెరవేర్పును గురించి 1 రాజులు 16:34లో మనం చదువుతాం. నహూము, జెఫన్యా అనే యిద్దరు నీనెవె నాశనాన్ని గూర్చి ముందుగా చెప్పారు. యెషయా బబులోను నాశనాన్ని గూర్చి ప్రవచించాడు, కోరెషు అనే రాజు పేరును ఆ రాజు పుట్టక మునుపే యిచ్చాడు (యెషయా 45:1). ప్రపంచ రాజ్యాలు ఒకదానివెంట ఒకటి లేచి పడిపోతాయని దానియేలు ముందుగా సూచించాడు (దానియేలు 2). అది సంభవించకముందే యెరూషలేము యొక్క నాశనాన్ని గూర్చి ప్రభువు ముందుగా చెప్పారు (మత్తయి 24).

### యూదుల దేశాన్ని గూర్చిన ప్రవచనాలు

ఆ రాజ్యం స్థాపింపబడడానికి మూడువందల సంవత్సరాలకు పూర్వమే, ఇశ్రాయేలు రాజును గూర్చి ద్వితీయో. 28:36లో ప్రవచింపబడింది. అదే లేఖన భాగం, బబులోను చెర సంభవించడానికి ఎనిమిదివందల సంవత్సరాలకు ముందే దాన్ని గూర్చి తెలిపింది. ఇశ్రాయేలీయులు విస్మయాస్పదముగాను, అపహాస్యాస్పదముగాను, ఎప్పటికిని పాడుగాను ఉండజేసెదను అని యిర్మీయా ప్రవచించాడు (యిర్మీయా 25:9). ఇశ్రాయేలీయులు చెదరగొట్టు చోటే ప్రజలలో విస్మయమునకు, సామెతకు హేతువగుదురని మోషే ముందుగానే ప్రవచించాడు (ద్వితీయో. 28:37). ఇశ్రాయేలీయుల చరిత్ర పాత నింబంధన దైవ ప్రేరేపితమయ్యిందనడానికి గట్టి రుజువుగా ఉంది.

### ప్రభువైన యేసును గూర్చిన ప్రవచనాలు

సాధారణంగా ఒకని జీవిత చరిత్ర అతని మరణానంతరం వ్రాయబడుతుంది, ఎవని జీవిత గాథలో అధిక భాగం ఆయన జన్మకు ముందే వ్రాయబడిందో ఆయన యిక్కడ ఉన్నాడు. పాత నిబంధనలో వందలకొలది వివరాలు నజరేయుడైన యేసుకు

చెందుతాయి. ఈ ప్రవచనాలు, వాటి చారిత్రిక నెరవేర్పులు పాత నింబంధన దైవ ప్రేరేపణను, వాటిని నెరవేర్చిన యేసు యొక్క దైవత్వాన్ని రుజువు చేస్తున్నాయి. ఈ క్రిందనున్న ప్రతి దానికి ప్రవచనాలున్నాయి:

1. ఆయన వంశావళి (ఆది. 3:15; 12:3; 49:10; యెషయా 11:1; యిర్మీయా 23:5)
2. ఆయన జననం (యెషయా 7:14; మీకా 5:2)
3. ఆయన జీవితం (యెషయా 53:3-9; హోషేయ 11:1)
4. ఆయన మరణం (కీర్తన. 22:16-18; 34:20; యెషయా 53:9)
5. ఆయన సమాధి (యెషయా 53:9)
6. ఆయన పునరుత్థానం (కీర్తన. 16:10)
7. ఆయన ఆరోహణం (కీర్తన. 68:18)

ఈ విధంగా యేసు యొక్క గాథ ఆయన భూలోకానికి అవతరించక ముందే వ్రాయబడింది. ప్రవచనాల ద్వారా తెలుపబడిన బలమైన వాదనను కాదనగలిగిన దానినేనెన్నడు చూడలేదు!

## బైబిలు యొక్క ఖచ్చితత్వం (తప్పులేమి)

కొన్ని సంవత్సరాలలో బైబిలు, విజ్ఞానము అనే వాటిని గూర్చి చాలా చెప్పబడుతోంది. విజ్ఞాన శాస్త్ర వాస్తవాలతో బైబిలు ఏకీభవించలేదని బైబిలును ప్రక్కన పెట్టడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు. దానికి భిన్నంగా, బైబిలు ఉపదేశానికిని, నిజమైన విజ్ఞాన శాస్త్రానికిని ఏ వైరుధ్యం కన్పించడంలేదు.

బైబిలు, విజ్ఞాన శాస్త్రము అనే చర్చలో రెండు విషయాలు ముందుకు వస్తాయి. మొదటిది, బైబిలులో ఎలాటి శాస్త్ర దోషాలు లేవు. ఆరంభంలో, బైబిలు యొక్క దైవ ప్రేరేపణకు యిది బలమైన రుజువుగా గోచరించక పోవచ్చు. ఏదియెలాగున్నా, బైబిలు వ్రాయబడుతున్న దినాలలో విజ్ఞాన శాస్త్ర పరిధిలో ఉన్న దోషాలను మనం జ్ఞాపకం చేసికొన్నప్పుడు, అలాటి దోషాలు ఈ గ్రంథంలో విడనాడబడడానికి అద్భుతంకంటే తక్కువైనది ఏదీ జరిగియుండదని మనం గ్రహించాలి. దానిలో ఏది లేదో దాన్నిబట్టి నేను బైబిలును నమ్ముతాను. ఈ లేఖకులు దైవ ప్రేరేపితులు కానట్టయితే, విజ్ఞాన రంగమందు, ఈ లేఖకుల కాలంలో బహుగా విస్తరించి, స్పష్టంగా కన్పించే తప్పుడు, బుద్ధిహీనమైన భావాలు ఎందుకు తమ స్థానాన్ని తీసికోలేకపోయాయి? తమ కాలంలోని జ్ఞానాన్ని బైబిలు లేఖకులు దాఖలు చేశారనే భావాన్ని ఈ విషయం వల్ల కొట్టివేయవచ్చు.

రెండవది, మానవ మనస్సు అప్పటిలో కనుగొనని విజ్ఞాన శాస్త్ర సత్యాలను బైబిలు లేఖకులు దాఖలు చేశారు. భూమి గుండ్రంగా ఉందని, భూమ్యాకర్షణ శక్తి, ఉత్తర దిక్కున ఉన్న శూన్య ప్రదేశము అనేవి వాటిలో కొన్ని ఉదాహరణలుగా చూపబడ్డాయి

(యెషయా 40:22; యోబు 26:7). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగ లేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" అని 2 పేతురు 1:21లో చెప్పబడినట్టు మనం తీర్మానించవలసిందే. దైవికమైన ప్రేరేపణ లేకుండా ఆ మనుష్యులు ఈ సంగతులను ఎరిగియుండేవారు కారు. విజ్ఞాన శాస్త్ర దృష్టితో బైబిలు పఠనం కావించడానికి కొందరు భయపడి ఉండవచ్చు, కాని భయపడవలసినది బైబిలుకు ఏమీ లేదు! లోహం శుద్ధీకరించే పాత్రలోనుండి ప్రశస్తంగా బయలువెళ్లినట్టు, యింతకముందు ఎన్నడూలేని రూపంలో అది మన ముందు నిలుస్తుంది.

## ముగింపు

లోకంలో బైబిలు అత్యంతంగా ప్రేమింపబడే గ్రంథం, ఎల్లప్పుడూ అధికంగా అమ్ముడుపోయే గ్రంథం కూడా. దాని కొరకు కొందరు చనిపోయినా, అది బహు విపరీతంగా ద్వేషింపబడింది కూడా. అది లేకుండా పోతుందని శత్రువులు ప్రవచనాలు చెప్పారు కాని, అది లయముకానిదైయుంది. అగ్నిని, ఖడ్గమును, దాని మీద విరుచుకు పడిన ఇతర శక్తులన్నింటిని ఎదుర్కొని అది సజీవంగా నిలిచియుంది.

బైబిలు యొక్క వయస్సు, ఎంతైయున్నా, అది వాడుకలో లేనిదైయుండదు. దానికి అనుబంధం అక్కరలేదు అది పరిపూర్ణంగా వృద్ధి చెందియున్న గ్రంథం, అన్ని కాలాల్లో ఉన్న మనుష్యులందరి కొరకు అది రూపొందించబడింది. మానవాతీతమైన మూలంగలదై యుందనడానికి అది మరియొక బలమైన రుజువు. అది ఎల్లప్పుడు సందర్భ శుద్ధిగలదై ఉంటుంది. ఆకాశమును భూమియు గతించినా, దేవుని వాక్యము నిత్యము నిలుచును (యెషయా 40:8; 1 పేతురు 1:25).